# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 07-03-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు హాజరు అవుతారు.**

2. **సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు.**

3. **సాటి వారికి సాయం చేయాలనే అల్లా సందేశాన్ని పాటిస్తూ పవిత్ర రంజాన్ మాసాన్ని జరుపుకోవడం గొప్ప విషయమని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు.**

4. **వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ప్రకృతి సాగు ఎంతో ముఖ్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు.**

5. **విజయవాడలోని దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానంలో 12 ఏళ్లకోసారి నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాలు కొనసాగుతున్నాయి.**

==========================

ఢిల్లీలో జరుగుతున్న ప్రతిష్టాత్మక 'రైసినా డైలాగ్ 2026' సదస్సుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు హాజరు అవుతారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ – అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహిస్తున్నా ఈ ప్రతిష్టాత్మక సదస్సులో సాంకేతికత – సుపరిపాలన, భవిష్యత్ అంశాలపై ముఖ్యమంత్రి కీలక ఉపన్యాసం చేయనున్నారని అధికారులు తెలిపారు. ఈ ఏడాది జరగనున్న 11వ ఎడిషన్ రైసినా డైలాగ్ సదస్సు సంస్కార – అన్వేషణ, సమన్వయం, పురోగతి అనే ఇతి వృత్తంతో నిర్వహిస్తున్నారు. దేశంలో అభివృద్ధి పథంలో నడుస్తున్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ లో అమలు చేస్తున్న సుపరిపాలన– డిజిటల్ అంశాలపై ముఖ్యమంత్రి తన ప్రసంగంలో వివరించనున్నారని అధికారులు పేర్కొన్నారు.

---------------------------

సమాజాభివృద్ధిలో మహిళల పాత్ర కీలకమని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం 22వ స్నాతకోత్సవంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. వివిధ కోర్సుల్లో డిగ్రీలు పూర్తి చేసిన 2 వేల 5 వందల 91 మంది విద్యార్థినులకు పట్టాలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. చదువుతో పాటు విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అధ్యాపకుల మార్గదర్శకత వల్లే విద్యార్థులకు విజయాలు సాధ్యమని గవర్నర్ తెలియజేస్తూ...

వాయిస్ 29

---------------------------

సాటి వారికి సాయం చేయాలనే అల్లా సందేశాన్ని పాటిస్తూ పవిత్ర రంజాన్ మాసాన్ని జరుపుకోవడం గొప్ప విషయమని కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరులోని పట్టాభిపురంలో నిన్న రాత్రి ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముందుగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన తరువాత ఇఫ్తార్ విందు స్వీకరించారు. అత్యంత పవిత్రంగా ముస్లిం సోదరులు నిర్వహించుకునే రంజాన్ ఆత్మ శుద్ధికి నిదర్శనమని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొంటూ..

వాయిస్ 25

---------------------------

వ్యవసాయం లాభసాటిగా మారాలంటే ప్రకృతి సాగు ఎంతో ముఖ్యమని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత అన్నారు. విజయవాడలో జరిగిన ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల కోసం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై వర్క్ షాప్ లో ఆమె ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రైతులు రసాయనాలపై ఆధారపడకుండా సేంద్రియ ఎరువలతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయ ఆవశ్యకత గురించి ప్రభుత్వం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు మంత్రి సవిత తెలియజేస్తూ..

వాయిస్ 29

---------------------------

వ్యవసాయ అనుబంధ రంగాలను ప్రోత్సహించేలా రైతులకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సూచించారు. నెల్లూరులో జరిగిన జిల్లాస్థాయి బ్యాంకర్ల సమితి సమావేశంలో ఆయన ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వ్యవసాయ యాంత్రీకరణ వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు కలుగుతాయని, ఖర్చులు తగ్గి వ్యవసాయం మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లు, డ్రోన్‌లు వంటి పరికరాల కొనుగోలుకు అన్ని బ్యాంకులు ఉదారంగా రైతులకు రుణాలు మంజూరు చేయాలని చెప్పారు.

---------------------------

విజయవాడలోని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో 12 ఏళ్లకోసారి నిర్వహించే కుంభాభిషేక మహోత్సవాలు కొనసాగుతున్నాయి. కుంభాభిషేక మహోత్సవాలకు వస్తున్న భక్తులకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మహా కుంభాభిషేక మహోత్సవంలో విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ ఈరోజు పాల్గొన్నారు. భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా మహా కుంభాభిషేక క్రతువును దిగ్విజయంగా జరిగేలా చూడాలని ఆలయ అధికారులకు ఆయన సూచించారు.

---------------------------

కృష్ణాజిల్లాలోని మచిలీపట్నం పోర్టులో రూ. 3వందల95 కోట్ల .38 లక్షల రూపాయలతో అదనపు పనులు చేపట్టేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం నిన్న ఉత్తర్వులు జారీ చేసింది. బ్రేక్‌వాటర్స్, షోర్ ప్రొటెక్షన్ కోసం

రూ. 210.06 కోట్లు రూపాయలు పునరుద్ధరణ, నేవిగేషన్ కోసం 144.77 కోట్లు మొత్తాన్ని అదనంగా చెల్లించేందుకు అనుమతించింది. వాటితో పాటు రూ. 40.55 కోట్లతో సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణ పనులు చేపట్టేందుకు అనుమతించింది.

---------------------------

గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్ సాధనే ప్రధాన లక్ష్యమని ఈగల్ ఐజీ రవికృష్ణ పేర్కొన్నారు. ఈగల్ టీం ఆధ్వర్యంలో ఆపరేషన్ వజ్రప్రహార్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా కార్డన్ సెర్చ్ ఈరోజు జరుగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 100 చోట్ల ఈ ఆపరేషన్ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి సరఫరా జరిగే 849 హాట్ స్పాట్స్ గుర్తించినట్లు వెల్లడించారు. కార్డన్ సెర్చ్ ద్వారా గంజాయి రవాణా అదుపులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు తనిఖీలు కొనసాగుతాయని ఆయన స్పష్టం చేశారు.

---------------------------

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కలెక్టరేట్ నుంచి గడియారపు స్తంభం వరకు ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జరిగిన బైక్ ర్యాలీ లో ఎస్పీ రాహుల్ మీనా ఈరోజు పాల్గొన్నారు అనంతరం గడియారపు స్తంభం వద్ద మానవ హారంగా ఏర్పడి "సమానత్వం మహిళా సాధికారత హక్కులు" అనే ఇతి వృత్తంతో బెలూన్లు ఎగర వేశారు. ఈ సందర్భంగా ఎస్పీ రాహుల్ మీనా మాట్లాడుతూ.. నేటి ఆధునిక యుగంలో మహిళలు అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రాణిస్తున్నారని చెప్పారు. మహిళలు తమలోని శక్తిని గుర్తించి ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయడంతోనే ఆశించిన సమానత్వ సమాజాన్ని నిర్మించగలమని తెలిపారు.

---------------------------

ఐసిసి పురుషుల టి 20 ప్రపంచ కప్ మ్యాచ్ లు ఫైనల్ కు చేరుకున్నాయి. తుది పోరులో భారత్, న్యూజిలాండ్ జట్లు తలపడనున్నాయి. సెమీ ఫైనల్ లో భారత్, ఇంగ్లాండ్ జట్టును ఓడించగా, న్యూజిలాండ్ దక్షిణ ఆఫ్రికా జట్టు ఓడించి ఫైనల్ కు చేరాయి. అహ్మదాబాద్ లోని నరేంద్రమోదీ స్టేడియంలో రేపు రాత్రి ఏడు గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఇప్పటి వరకు భారత్ రెండు సార్లు టీ 20 ప్రపంచ కప్ గెలవగా, న్యూజిలాండ్ 2021లో ఫైనల్ చేరి రన్నర్ ప్ గా నిలిచింది.

---------------------------

ఏలూరు జిల్లా వ్యాప్తంగా నియోజకవర్గ స్థాయిలో శాసన సభ్యులు నిర్వహించే 'ప్రజాదర్బార్'లో అందిన వినతులను నిర్దేశించిన సమయంలోగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు.

=====================